ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 డిసెంబర్
2025



# ఎస్.వీ.ఎన్ 'త్రిలుమినా'లో పొంగిపొర్లిన పూర్వ విద్యార్థుల ఆత్మీయత!

## ముప్పై ఏళ్ల జ్ఞాపకాల ముత్యాల హారం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: కాలం వెనక్కి వెళ్ళింది... జ్ఞాపకం మళ్ళీ ప్రాణం పోసుకుంది.. ముప్పై ఏళ్ల క్రితం ఏ తరగతి గదుల్లోనైతే భవిష్యత్తుకు పునాదులు పడ్డాయో, అదే ప్రాంగణం ఆదివారం భావోద్వేగాల వెల్లువకు సాక్ష్యంగా నిలిచింది. యాదగిరిగుట్టలోని ప్రసిద్ధ SVN పాఠశాలలో నిర్వహించిన 'త్రిలుమినా – 30 ఏళ్ల వేడుకల' (TRILUMINA - 30 Years Celebrations) లో భాగంగా జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అద్భుతమైన అనుభూతులను మిగిల్చింది.

**కంటతడి పెట్టిన జ్ఞాపకం.. పాదాభివందనం చేసిన శిష్యరికం!**

ముప్పై ఏళ్ల క్రితం విద్యాభ్యాసం చేసిన సీనియర్ల నుండి నిన్న మొన్నటి విద్యార్థుల వరకు అందరూ ఒకే వేదికపైకి చేరారు. హోదాలు పక్కన పెట్టి.. వయసును మరచి.. మళ్ళీ విద్యార్థులుగా మారిపోయారు. మూడు దశాబ్దాల క్రితం తమకు అక్షరభిక్ష పెట్టి, జీవిత పాఠాలు నేర్పిన గురువులు శ్రీ భాస్కర్ సార్, శ్రీమతి మాధురి మేడమ్లను చూడగానే విద్యార్థుల కళ్ళు చెమర్చాయి. తమను తీర్చిదిద్దిన ఆ దంపతుల పాదాలకు నమస్కరించి, ఆత్మీయంగా హత్తుకున్న దృశ్యం అక్కడ ఉన్న వారందరినీ కదిలించింది. ఒక విద్యాసంస్థ పట్ల విద్యార్థులకు ఉన్న గౌరవం, కృతజ్ఞతకు ఈ సన్నివేశం ప్రతిబింబంగా నిలిచింది.

**తరాల వారధిగా 'త్రిలుమినా'**

ఈ కార్యక్రమంలో పాఠశాల నూతన డైరెక్టర్ వృత్తిక్ పూర్వ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. భాస్కర్ సార్ వేసిన బలమైన పునాదిపై, వృత్తిక్ నేతృత్వంలో SVN భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుందని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు.

**కార్యక్రమ విశేషాలు:**

నృత్య ప్రదర్శనలు: పదో తరగతి విద్యార్థినులు ప్రదర్శించిన హృద్యమైన నృత్యాలు అందరినీ అలరించాయి. ఉత్సాహం ఆపుకోలేక పూర్వ విద్యార్థులు సైతం వేదికపైకి వచ్చి వారితో కలిసి చిందులేశారు.

సన్మానాలు: పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వ్యవస్థాపక దంపతులకు ఘన సన్మానం జరిగింది.

**ప్రతీ విద్యార్థికి జ్ఞాపికతో సత్కారం అరుదైన గుర్తింపు**

ప్రతి పూర్వ విద్యార్థికి ప్రత్యేక మెమెంటోలు మరియు అవార్డులను అందజేసి, వారు పాఠశాల కుటుంబంలో భాగమేనని గౌరవించారు.

ముగింపు: ఒక్కసారి SVN.. ఎప్పటికీ SVN!

"మేము ఎక్కడ ఉన్నా, ఏ హోదాలో ఉన్నా.. ఈ మట్టి, ఈ పాఠశాల నేర్పిన క్రమశిక్షణే మా ఆయుధం" అంటూ పూర్వ విద్యార్థులు గర్వంగా చాటారు. ఒక పాఠశాల అంటే కేవలం గోడలు, పుస్తకాలు కాదని.. అదొక భావోద్వేగమని, ఒక గొప్ప కుటుంబమని ఈ 'త్రిలుమినా' వేడుక మరోసారి నిరూపించింది.







































ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 డిసెంబర్
2025







# అక్షర సేద్యంలో 'ఎస్.వీ.ఎన్' ఆదర్శం: అల్లం నారాయణ





- మీడియా అకాడమీ తొలి చైర్మన్ అల్లం నారాయణ కు అపూర్వ స్వాగతం పలికిన ఎస్.వీ.ఎన్
- ఎస్.వీ.ఎన్ 30 ఏళ్ల జర్నీ అద్భుతం
- ఎస్.వీ.ఎన్ సేవలను కొనియాడన అల్లం నారాయణ







యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: సమాజ వికాసానికి అక్షరమే అసలైన ఆయుధమని, అట్టడుగు వర్గాల బిడ్డలకు విద్యా దానాన్ని అందిస్తూ ఎస్.వీ.ఎన్ (SVN) విద్యాసంస్థ ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తోందని తెలంగాణ మీడియా అకాడమీ తొలి చైర్మన్ అల్లం నారాయణ కొనియాడారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వి.ఎన్ పాఠశాల 30 ఏళ్ల 'త్రిలోమినా' వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

సభకు ఎస్వీఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ తన జీవితానుభవాలను పంచుకున్నారు. "మేము ముగ్గురం అన్నదమ్ములం అక్షరాన్నే నమ్ముకున్నాం కాబట్టే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందగలిగాం. నమస్తే తెలంగాణ ఎడిటర్‌గా నా ప్రస్థానం వెనుక, నా సోదరుడు అల్లం రాజయ్య అద్భుతమైన సాహిత్య సృష్టి వెనుక ఉన్న శక్తి అక్షరమే" అని గుర్తుచేశారు. ఒకవైపు జర్నలిస్టుగా బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు విద్యావేత్తగా ఎస్.వి.ఎన్ ద్వారా భాస్కర్ చేస్తున్న సేవలు అమోఘమని అందుకే మాకంటే ఎంతో గొప్పవాడు భాస్కర్ అని ఆయన ప్రశంసించారు. మధు ఎన్నో ఏళ్లుగా కలిసి పని చేస్తున్నారు తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా అనేక కార్యక్రమాలు నిర్బంధాన్ని లెక్కచేయకుండా పనిచేసే విముక్తి పోరాటంలో భాగస్వాముడయ్యాడని చెప్పారు. 130 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం ఆయన దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**మూడు దశాబ్దాల జైత్రయాత్ర**

సభకు అధ్యక్షత వహించిన సంస్థ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో చైతన్యం, జాగృతి కలిగించడమే లక్ష్యంగా గత 30 ఏళ్లుగా ఎస్.వీ.ఎన్ సాగుతోందని అన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నతాధికారులుగా స్థిరపడటం ఈ సంస్థ సాధించిన అతిపెద్ద విజయమని, ఇది 'ఎస్.వి.ఎన్ జైత్రయాత్ర' అని అభివర్ణించారు.

**ముఖ్య అతిథుల సందడి**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాన్ని మారుతి సాగర్ మాట్లాడుతూ.. ఎస్.వి.ఎన్ ప్రయాణం అత్యంత అద్భుతమైనదని, పాత విద్యార్థులు మళ్లీ ఇక్కడికి రావడం ఒక మధురానుభూతిని కలిగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పిఆర్ఓ రమేష్ హజారి, తెంజు రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణకుమార్, కోశాధికారి యోగి, జాతీయ నాయకులు అవారి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య, వర్ధిల్లి వెంకటేశ్వర్లు, లెనిన్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



**విశేషాలు:**

వచ్చిన అతిథులను జ్ఞాపికలు, శాలువాలు మరియు స్వామివారి లడ్డూ ప్రసాదంతో ఘనంగా సత్కరించారు.

విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, అకాడమిక్ డైరెక్టర్ వృతిక్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# భక్తులతో యాదగిరిగుట్ట కిటకిట

**ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం**

**ఆదివారం ఆలయానికి రూ.50.11 లక్షల ఆదాయం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. రద్దీ కారణంగా కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, కొండ కింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపాలు సందడిగా దర్శనమిచ్చాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో.. స్వామివారి ధర్మదర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిత్యకల్యాణం, సుదర్శన నారసింహ హోమం, సువర్ణపుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.50,11,920 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.20,01,980 లక్షలు, వీఐపీ దర్శన టికెట్ల ద్వారా రూ.7.95 లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.8,19,500, బ్రేక్ దర్శనాలతో రూ.5,44,200 లక్షల అదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**యాదగిరిగుట్ట ఆలయానికి మూడు క్లీనింగ్ మెషిన్స్ అందజేత**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి రెండు కంపెనీలు మూడు క్లీనింగ్ మెషిన్స్ ను ఆదివారం అందజేశారు. హైదరాబాద్ కు చెందిన 'కృష్ణ జ్యువెల్లర్స్', పూణేకు చెందిన 'ఊట్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్' కలిసి యాదగిరిగుట్ట ఆలయానికి రూ.5.95 లక్షల విలువ చేసే మూడు క్లీనింగ్ మెషిన్స్ ను విరాళంగా అందజేశారు. ఈ క్లీనింగ్ మెషిన్స్ తో ఆలయ అధికారులు ట్రయల్ రన్ చేశారు. రెండు క్లీనింగ్ మెషిన్స్ ను ప్రధానాలయ మాడవీధులు, మరో క్లీనింగ్ మెషిన్ ను అన్నప్రసాద విభాగం క్లీనింగ్ కు ఉపయోగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**నారసింహుడి సేవలో భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి ఆదివారం దర్శించుకున్నారు. గర్భగుడిలో లక్ష్మీసమేత నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ ఆఫీసర్లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తూర్పు త్రితల గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం పీఠాధిపతి.. ఆలయ అర్చకులు, సిబ్బందికి పండిత గోష్టి నిర్వహించి పండ్లు అందజేశారు. అనంతరం ఆయనకు ఆలయ డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో గజవెల్లి రఘు, అర్చకులు శ్రీకాంత్, సిద్దు, వేదపండితులు తదితరులు ఉన్నారు.

# రాజాపేట టిఆర్ఎస్ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా పల్లె సంతోష్ గౌడ్



రాజాపేట, రోమింగ్ న్యూస్: రాజపేట మండలంలోని చిల్మెడి ఫంక్షన్ హాల్ లో నూతనంగా గెలిచిన టిఆర్ఎస్ పార్టీ సర్పంచులకు మండల పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సర్పంచ్ ఫోరంల అధ్యక్షునిగా రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల పార్టీ అధ్యక్షులు తిరుమలేష్ మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్ సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి ఎర్ర గోకుల జశ్వంత్ నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఇండ్ల అనూష సుమన్ సంపత్ కుమార్ బొడ్డు భాస్కర్ ఠాకూర్ లావణ్య ధర్మేందర్ సింగ్ ఇండ్ల రాజయ్య పయ్యావుల ఎల్లయ్య జిన్నపల్లి బాలరాజు రెడ్డి కొండ ప్రమీల పాండరి తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ సొంత నిధులతో బీటీ రోడ్డుకు మరమత్తులు

**చిన్నలక్ష్మాపూర్ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపూర్ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి తన సొంత ఖర్చులతో గుంతలమయమైన బీటీ రోడ్డుకు మరమ్మత్తులు చేపించారు. వివరాల్లోకి వెళ్తే.. మాదాపూర్ నుండి చిన్నలక్ష్మాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గ్రామ ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇటీవల నూతనంగా ఎన్నికైన చిన్నలక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి దాదాపుగా రూ.1.50 లక్షల తమ సొంత డబ్బులు వెచ్చించి.. మాదాపూర్ గ్రామం నుండి చిన్నలక్ష్మాపూర్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డులో ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలు పూడ్చి ప్యాచ్ వర్క్ చేయించారు. ఏదైనా అత్యవసర సమయాల్లో రోడ్డు వెంట ప్రయాణం ప్రమాదకరంగా మారడంతో.. పొట్టిమర్రి తండా, చిన్నలక్ష్మాపూర్ గ్రామ ప్రజల సౌకర్యార్థం బీటీ రోడ్డుపై గుంతలు పూడ్చడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పార్వతి చిన్న నాయక్, వార్డు మెంబర్లు రమావత్ నరేష్ నాయక్, ఓర్సు రాములు, సునీత నవీన్ రెడ్డి, సరిత రమేష్, కొత్త ప్రశాంత్ రెడ్డి, అంకిరెడ్డి కుమార్, మోత్కుపల్లి రవి, బోళ్ల భాస్కర్, బొల్లా సురేష్, పులిగిళ్ల సురేశ్, నరిగే సత్యరావు, ఓర్సు ప్రశాంత్, పులిగిళ్ల ప్రవీణ్, బొల్లా ఉపేందర్, గ్రామ యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డును తలపించేలా యాదగిరిగుట్ట వీధులు

**సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా యాదగిరిగుట్ట పట్టణ వీధులు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు మండిపడ్డారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో ఇంటింటికి సీపీఐ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా.. ఆదివారం 9, 10, 11, 12 వార్డులలో సీపీఐ నాయకులు పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇండ్ల మధ్యన ఉన్న వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వస్తోందని, తద్వారా పట్టణ వాసులు ఇండ్లలో కూడా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా లోటస్ టెంపుల్ ఏరియాలో వీధులు చెత్తా చెదారం, నిల్వ నీటితో డంపింగ్ యార్డును తలపించేలా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఇండ్లు చాలా ఉన్నాయని, ఎలాంటి ప్రమాదాలు జరగకముందే వాటిని వెంటనే కూల్చివేయాలన్నారు. అనంతరం పాదయాత్ర ద్వారా గుర్తించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, సహాయ కార్యదర్శి బంగారు, గోపగాని రాజు, బాలకిషన్ తదితరులు ఉన్నారు.



# “దళపతి” విజయ్ తెర మీద వెలుగులకు ఫుల్ స్టాప్..!

దళపతి విజయ్ సౌత్ ఇండస్ట్రీలో అత్యధిక ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న స్టార్ హీరో. కోలీవుడ్ ఇండస్ట్రీలో దాదాపు 35 ఏళ్ల కెరీర్ లో యువ హీరో నుంచి తిరుగులేని స్టార్ హీరోగా మారిన చరిత్ర ఆయనది. తనదైన శైలిలో ప్రేక్షకులను మెప్పిస్తూ యాక్షన్, కామెడీ, ఎమోషన్ ఇలా అన్నిటితో పాటు తనకు మాత్రమే సాధ్యమయ్యే స్టైలిష్ డ్యాన్స్ తో ఫ్యాన్స్ ని విజిల్స్ వేసేలా చేస్తారు దళపతి విజయ్. పోటీగా కమల్ హాసన్, రజనీకాంత్ లాంటి పెద్ద స్టార్స్ ఉన్నా కూడా వాళ్లను కూడా దాటేసే క్రేజ్ ఇమేజ్ తెచ్చుకున్నారు విజయ్. దళపతి విజయ్ సినిమా అంటే చాలు బొమ్మ బ్లాక్ బస్టర్ అవ్వాల్సిందే అనే రేంజ్ లో అభిమానుల కోలాహలం ఉంటుంది. కోలీవుడ్ లో సూపర్ స్టార్ రజనీ ఇమేజ్ ని మ్యాచ్ చేయగల స్టార్ మరొకరు లేరన్న రోజు నుంచి రజనీని సైతం వెనక్కి నెట్టి తన స్టార్ డం చాటిన స్థాయికి ఎదిగాడు దళపతి విజయ్. సినిమాల్లో తన పాత్రలతో ఆబాల గోపాలాన్ని అలరించిన ఆయన ఇప్పుడు నిజజీవితంలో ప్రజల కోసం నిలబడుతున్నారు.

తెర మీద దళపతి విజయ్ గా ఆయన చేసిన సినిమాలు అందుకున్న అవార్డులు సృష్టించిన రికార్డులు తెలిసిందే. ఐతే 35 ఏళ్లుగా సినీ స్టార్ గా అభిమాన కథానాయకుడిగా ప్రేక్షకులను అలరించిన దళపతి విజయ్ సినిమాలకు ఫుల్ స్టాప్ పెట్టేస్తున్నారు. పాలిటిక్స్ లో వచ్చే ముందే సినిమాలకు గుడ్ బై చెప్పాలనుకున్న విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ తోనే సినిమాలకు ఫుల్ స్టాప్ పెడుతున్నారు. ఐతే వాళ్లు వీళ్లు చెప్పడమే కానీ దళపతి విజయ్ తన సినిమాల రిటైర్మెంట్ గురించి చెప్పలేదుగా అని ఫ్యాన్స్ భావించారు. ఎక్కడో ఒక చిన్న ఆశతో తమ హీరో అటు రాజకీయాల్లో ఉంటూ సినిమాలు కూడా చేస్తాడని అనుకున్నారు. కానీ విజయ్ తన సినిమా అదే లాస్ట్ మూవీ జన నాయగన్ ఆడియో రిలీజ్ ఈవెంట్ లో తన సినిమా రిటైర్మెంట్ ప్రకటించారు. కౌలాలంపూర్ లో జరిగిన జన నాయగన్ ఆడియో రిలీజ్ ఈవెంట్ లో విజయ్ ఫ్యాన్స్ ను ఉద్దేశించి మాట్లాడారు. ఇన్నేళ్లుగా తనని అభిమానిస్తున్న ఫ్యాన్స్ కి కృతజ్ఞతలు తెలిపారు. నా కోసం ఎంతోమంది సినిమా థియేటర్స్ కి వెళ్లి సినిమాలు చూశారు. ఇన్నాళ్లు తనకు సపోర్ట్ చేసిన వారి కోసం మరో 30 ఏళ్లు నిలబడతా అభిమానులకు సేవ చేయడం కోసమే సినిమాలకు స్వస్తి పలుకుతున్నా జన నాయగన్ నా చివరి సినిమా అని ప్రకటించారు దళపతి విజయ్. విజయ్ రాజాకెయాల్లోకి రావాలనుకున్నప్పుడే సినిమాలను ఆపేయాలని నిర్ణయించుకున్నారు. ఐతే ఇదంతా సడెన్ గా జరిపోయింది. ఐతే ఈ విషయం ముందే ఫిక్స్ అయితే ఆయనతో కొన్ని క్రేజీ కాంబినేషన్ సెట్ చేయాలనుకున్న మేకర్స్ కి కాస్త ఉపయోగకరంగా ఉండేది. ఆలోచన రావడమే ఆలస్యం జనం కోసం సినిమాలను ఆపేయాలని జన నాయగన్ తన చివరి సినిమా అని ఫిక్స్ అయ్యారు దళపతి విజయ్. విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం ఫ్యాన్స్ ని కాస్త ఎమోషనల్ అయ్యేలా చేస్తున్నా ఆయన రీల్ హీరో నుంచి రియల్ హీరో అయ్యేందుకు చేస్తున్న ఈ ప్రయత్నానికి అండగా నిలబడాలని భావిస్తున్నారు.



# మూడో రోజు కూడా తగ్గని ‘ఛాంపియన్’



రోషన్ మేక హీరోగా వైజయంతీ మూవీస్ బ్యానర్ లో తెరకెక్కిన ‘ఛాంపియన్’ సినిమా బాక్సాఫీస్ దగ్గర తన పట్టు నిలుపుకుంటోంది. విడుదలైన మొదటి రోజు మిక్స్ డ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ ప్రభావం కలెక్షన్స్ మీద పడకుండా చూసుకోవడంలో చిత్ర యూనిట్ సక్సెస్ అయ్యింది. ముఖ్యంగా మూడో రోజు కూడా ఈ సినిమా వసూళ్లలో డ్రాప్ లేకుండా స్ట్రాంగ్ హోల్డ్ ని మెయింటైన్ చేయడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సినిమా రిలీజ్ కి ముందు మేకర్స్ చేసిన భారీ ప్రమోషన్స్ ఇప్పుడు బాగా ప్లస్ అవుతున్నాయి. ముఖ్యంగా చార్ట్ బస్టర్ గా నిలిచిన ‘గిర గిర’ సాంగ్ ఆడియెన్స్ ని థియేటర్లకు రప్పించడంలో కీ రోల్ ప్లే చేస్తోంది. రోషన్ స్క్రీన్ ప్రెజెన్స్, అనశ్వర రాజన్ గ్లామర్, రిచ్ ప్రొడక్షన్ వాల్యూస్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దీంతో మౌత్ టాక్ నెమ్మదిగా మెరుగుపడుతూ వస్తోంది.

రోషన్ కి ఇది మూడో సినిమా అయినప్పటికీ, ఈ సినిమా స్కేల్, మేకింగ్ పరంగా చూస్తే ఒక గ్రాండ్ రీ లాంచ్ లాంటిదే అని చెప్పాలి. ప్రస్తుతం బుక్ మై షోలో కూడా ఈ సినిమా బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. పండగ సీజన్ కాకపోయినా, మిగతా సినిమాల కంటే ‘ఛాంపియన్’ కే ఆడియెన్స్ ఓటు వేస్తున్నారు. ముఖ్యంగా అర్బన్ ఏరియాల్లో ఈ సినిమాకి ఆదరణ ఎక్కువగా కనిపిస్తోంది. కలెక్షన్స్ విషయానికి వస్తే సినిమా రేంజ్ ఏంటో అర్థమవుతుంది. చిత్ర బృందం విడుదల చేసిన లేటెస్ట్ పోస్టర్ ప్రకారం.. ‘ఛాంపియన్’ మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 8.89 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. కేవలం మూడో రోజే దాదాపు 2 కోట్లు వసూలు చేయడం సినిమా స్టామినాను చూపిస్తోంది. మిక్స్డ టాక్ తో మూడు రోజుల్లోనే దాదాపు 9 కోట్లకు చేరువవ్వడం అంటే మామూలు విషయం కాదు.

ఆదివారం కూడా బుకింగ్స్ చాలా స్ట్రాంగ్ గా ఉండటంతో ఫస్ట్ వీకెండ్ నంబర్స్ భారీగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ చూస్తుంటే రోషన్ కమర్షియల్ గా సేఫ్ జోన్ లోకి వెళ్తున్నట్లే కనిపిస్తోంది. టాక్ తో సంబంధం లేకుండా మాస్, యూత్ ఆడియెన్స్ ఈ సినిమాను ఓన్ చేసుకున్నారు. ‘ఛాంపియన్’ బాక్సాఫీస్ పరుగు పాజిటివ్ గానే ఉంది. ఈ వీకెండ్ గడిస్తే సినిమా కమర్షియల్ హిట్ స్టేటస్ కి దగ్గరయ్యే ఛాన్స్ ఉంది. సోమవారం నుంచి సినిమా జోరు ఎలా ఉంటుందనే దాన్ని బట్టి లాంగ్ రన్ డిసైడ్ అవుతుంది. ప్రస్తుతానికి అయితే రోషన్ బాక్సాఫీస్ విన్నర్ గా నిలిచేలా ఉన్నాడు.



## నిధి అగర్వాల్ ఉల్లిపొర చీర దేనికి కౌంటర్?

ఇటీవలే అనుకోకుండా నటుడు శివాజీ -సామాన్లు- అంటూ నటీమణుల ఎక్స్‌పోజింగ్ పై కామెంట్ చేయడం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. సినీపరిశ్రమకు చెందిన ప్రముఖులతో పాటు, సామాన్య జనంలోను ఇది డిబేట్ గా మారింది. శివాజీ వ్యాఖ్యలపై విచారణ చేపట్టడమే గాక, పురుషాహంకారంపై చాలా హంగామా సృష్టించారు. శివాజీ వ్యాఖ్యలలో నిధి అగర్వాల్ పేరు కూడా వినిపించడం, ఆ తర్వాత నిధి సోషల్ మీడియాల్లో అతడి వ్యాఖ్యలకు నర్మగర్భంగా కౌంటర్ వేయడం తెలిసినదే. అయితే అతడికి కౌంటర్ వేసిన తర్వాత మొదటిసారి నిధి అగర్వాల్ ఒక ఫిల్మీ వేదికపై ప్రత్యక్షమైంది. ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ ప్రీరిలీజ్ వేడుకలో నిధి సందడి చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. నిధి అగర్వాల్ ఈ వేదిక కోసం అందమైన చీరను ధరించింది. పాక్షికంగా అందాలను ఎలివేట్ చేసే ఉల్లిపొర చీరలో అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షించింది. అయితే నిధి ఇలా బోల్డ్ అవతార్ లో కనిపించడానికి కారణం, నిజానికి -శివాజీ-కి కౌంటర్ అని కొందరు నెటిజనులు భావిస్తున్నారు. నిధి వేషధారణపై మరోసారి నెటిజనుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. అయితే గ్లామర్ ఇండస్ట్రీలో ఆమాత్రం గ్లామర్ ఎలివేషన్ సర్వసాధారణం అని కూడా కొందరు విశ్లేషిస్తున్నారు. ఇక్కడ ఎలివేషన్ లేనిదే నటీమణులను ఎవరు పట్టించుకుంటారు? అనే కోణాన్ని కూడా చాలా మంది పరిశీలిస్తున్నారు. పద్ధతిగా చీర కట్టుకుని, ఒంటినిండా ఆభరణాలు ధరించి, పవిట కొంగు కప్పుకోవడానికి ఇదేమైనా ఆభారణాల షోరూమ్ ప్రకటన కాదు కదా! అని కొందరు కామెంట్ చేస్తున్నారు. అంతేకాదు.. ఇంతకుముందు నిధి అగర్వాల్ కొన్ని వాణిజ్య ప్రకటనల్లో ఎంతో పద్ధతిగా చీరకట్టులో సాంప్రదాయబద్ధంగా కనిపించిన వీడియోలు కూడా ఇప్పుడు ఇన్ స్టాలో వైరల్ అవుతున్నాయి.

# కియారాలో మార్పు కొత్త ఏడాది నుంచి అమలు!

బాలీవుడ్ నటి కియారా అద్వాణీకి 2025 ఏడాది కలిసొచ్చిందా? అంటే వ్యక్తిగతంగా కలిసొచ్చిందనాలి. కానీ వృత్తిగతంగా ఎంత మాత్రం కలిసి రాలేదన్నది అంతే వాస్తవం. ఈ ఏడాది ఆరంభంలోనే కియారా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చి అమ్మగా ప్రమోషన్ అందుకుంది. ప్రతీ మహిళ కనే ఓ అద్భుతమైన కలను ఈ ఏడాది సాధ్యం చేసుకుంది. ఆ రకంగా కియారా ఎంతో లక్కీ ఉమెన్. ప్రస్తుతం గర్భం దాల్చడం, పిల్లలు జన్మించడం అన్నది ఎంత కష్టంగా మారిందో తెలిసిందే. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కొన్ని రకాలు బాండింగ్స్ ను కూడా కోల్పోవాల్సిన రోజుల్లో ఉంది సొసైటీ. పెరిగిన రేడియేషన్ ప్రభావం మహిళలపై ఎంతగానో ప్రభావం చూపిస్తోంది. ఇలాంటి ఎన్నో సమస్యల్ని నేటి జనరేషన్ మహిళలు ఎదుర్కొంటున్నారు. అలా చూస్తే కియారా అద్వాణీ ఎంత అదృష్టవంతురాలు అని చెప్పొచ్చు. ఆ రకంగా 2025 మాత్రం ఎంతో కలిసొచ్చింది. కానీ ప్రొపెషనల్ గా మాత్రం కలిసి రాలేదు. ఈ ఏడాది టాలీవుడ్ నుంచి రిలీజ్ అయినా పాన్ ఇండియా సినిమా -గేమ్ ఛేంజర్- డిజాస్టర్ అయింది. రామ్ చరణ్ తో కలిసి నటించిన రెండవ చిత్రమిది. ఇదైనా హిట్ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకుంది కానీ పనవ్వలేదు. అనంతరం రిలీజ్ అయిన -వార్ 2-తోనైనా భారీ విజయం అందుకుంటుందని భావించారు. కానీ అది జరగలేదు. బాలీవుడ్ నుంచి పాన్ ఇండియాలో రిలీజ్ అయిన ఈ సినిమా కూడా డిజాస్టర్ ఖాతాలోనే పడింది. దీంతో కియారా అద్వాణీ ప్రొఫెషనల్ గా కొన్ని రకాల మార్పులకు శ్రీకారం చుట్టింది. వాటిని వచ్చే ఏడాది నుంచి అమలు పరచాలని సిద్దమవుతోంది. ఏంటా మార్పులు అంటే? స్టోరీల పరంగా ఇన్నోవేటివ్ గా ఉండటం...పాత్రల పరంగా యూనిక్ గా ఉండటం వంటిది ప్రధానంగా చేసిన మార్పుగా తెలుస్తోంది. ఇకపై తాను ఏ సినిమా కమిట్ అయినా? అన్ని రకాలుగా ఆలోచించే ఒకే చెబుతానంది. పాత్రల విషయంలో మరింత పరిణతితో వ్యవహరించాలంది. వేగంగా సినిమాలు చేయడం మానేసి మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు కొన్ని చేసినా మంచి ఫలితాలు సాధించొచ్చు అంటోంది. అలాగే ప్రచార క్యార్యక్రమాలు కూడా మునుపటిలా వేగంగా చేయనంటోంది. తొలి ప్రాధాన్యత తన ఉనికి, స్పష్టతకే ఇస్తానంది. కొన్ని లక్ష్యాలు ..కొత్త ఆలోచనలతో ముందుకెళ్తానంది. అలాగే సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉండాలనుకుంటున్నట్లు తెలిపింది. కంటెంట్ ఉన్న సినిమాలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నది అమ్మడి అంతిమ లక్ష్యంగా పేర్కొంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri
pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986